రాజకీయాల కోసం రైతులను బలిచేయొద్దు

- కాళేశ్వరం అంటే మేడిగడ్డ ఒక్కటే కాదు
- లోపాన్ని గుర్తించి మరమ్మతు చేయాలి
- రాజకీయ లబ్ధికోసమే సీఎం మేడిగడ్డ పర్యటన
- బీఆర్ఎస్‌పై బురదజల్లేందుకు ప్రయత్నం
- అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని మాట్లాడనివ్వడం లేదు
- ఇది ప్రజాస్వామ్య విలువలను మంటగలపడమే
- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆగ్రహం

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రాజకీయాల కోసం తెలంగాణ రైతాంగాన్ని ఇబ్బంది పెట్టొద్దని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ ఒక బరాజ్ మాత్రమేనని తెలిపారు. అక్కడ ఏదైనా లోపం జరిగితే దానిని సరిచేసి రైతులకు నీరందించాలని కోరారు. రాజకీయాల కోసం రైతులకు నీళ్లు ఇవ్వకుండా ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ ముందే నిర్ణయించిన నల్లగొండ సభకు పోటీగా సీఎం బృందం మేడిగడ్డ పర్యటన చేపట్టిందని ధ్వజమెత్తారు. మంగళవారం అసెంబ్లీ సమావేశం అనంతరం హరీశ్‌రావు మీడియా పాయింట్‌వద్ద మాట్లాడారు. శాసనసభ నిర్వహిస్తున్న తీరును ఖండిస్తున్నామని, ముఖ్యమంత్రి, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి అసెంబ్లీలో మాట్లాడి ప్రధాన ప్రతిపక్షానికి మాట్లాడేందుకు మైక్ ఇవ్వకపోవడం సభా సంప్రదాయాలకు విరుద్ధమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ప్రజాస్వామ్య విలువలు మంటగలిపే విధంగా ఉన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. కాళేశ్వరం సమగ్ర స్వరూపం చాలా మందికి తెలియదని, కాళేశ్వరం అంటే ఒక్క మేడిగడ్డనే కాదనే విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలని సూచించారు. కాళేశ్వరం అంటే మూడు బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 19 సబ్ స్టేషన్లు, 21 పంప్‌హౌజ్‌లు, 203 కిలోమీటర్ల సొరంగాలు, 1,531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 141 టీఎంసీల సామర్థ్యంగల స్టోరేజ్, 530 మీటర్ల ఎత్తుకు నీళ్లు ఎత్తిపోయడం, 240 టీఎంసీల ఉపయోగం వీటన్నింటి సమాహారమే కాళేశ్వరం ప్రాజెక్ట్ అని వివరించారు. ఒక బరాజ్‌లో ఒకటి రెండు పిల్లర్లు కుంగిపోతే కాంగ్రెస్ నాయకులు కోడిగుడ్డు మీద ఈకలు పీకుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు వెళ్లే దారిలో రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కూడవెల్లి వాగు, పచ్చటి పొలాలు చూడాలని హరీశ్‌రావు చురకలంటించారు. కాళేశ్వరం ఫలితాలు దుబ్బాక, సిద్దిపేట, గజ్వేల్, బెజ్జంకి, కరీంనగర్‌లో రైతులను అడిగితే చెప్తారని అన్నారు. కర్ణాటక నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వచ్చి మల్లన్నసాగర్, రంగనాయకసాగర్‌ను సందర్శించారని, అద్భుతం అంటూ మెచ్చుకున్నారని గుర్తుచేశారు.

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న హరీశ్‌రావు

మేడిగడ్డ ప్రాజెక్టు సందర్శనతో రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ లబ్ధిపొందాలని చూస్తున్నదని హరీశ్‌రావు ఆరోపించారు.

అప్పుడెందుకు అనుమతులు తేలేదు?

ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును తమ్మిడిహెట్టి వద్ద 2007లో ప్రారంభించి, కడితే ఎవరు వద్దన్నారని హరీశ్‌రావు ప్రశ్నించారు. 2007 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే ఉన్నది కదా? మిమ్మల్ని ఆపిందెవరు? అని నిలదీశారు. అప్పుడు అనుమతులు ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. తమ్మిడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మించాలంటే చాప్రాల్ వైల్డ్ లైఫ్ అభయారణ్యం ఉన్నదని, అక్కడ కట్టాలంటే అనుమతులు రావని గుర్తుచేశారు. అక్కడ నీళ్లు లేవని సీడబ్ల్యూసీ చెప్పిందని అన్నారు. తమ ప్రభుత్వం నీళ్లున్న దగ్గర ప్రాజెక్టు కట్టి.. పంటలకు పారించిందని చెప్పారు. సాగునీరందింది కాబట్టే కోట్లాది టన్నుల వరి ధాన్యం పండిందని తెలిపారు. కాళేశ్వరం నీళ్లు ఎస్సారెస్పీ స్టేజ్ -2, ఉమ్మడి మెదక్, కరీంనగర్ జిల్లాలో పారాయని తెలిపారు. కాళ్వేరం ప్రాజెక్టులో ఎక్కడ తప్పు జరిగిందో గుర్తించి, చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆ పని చేయకుండా గత ప్రభుత్వం మీద బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని సర్కారుపై ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పంజాగుట్ట ఫ్లై ఓవర్ కూలి 20 మంది చనిపోయారని, పుట్టంగండి రిజర్వాయర్ సీఎం ప్రారంభిస్తే నీళ్లు బయటికిపోతే బంద్ చేశారని గుర్తుచేశారు. దేవాదుల ప్రాజెక్టు పంపులు ఆన్ చేయగానే పటాకుల్లాగా పైపులు గాల్లోకి ఎగిరాయని, దురదృష్టవశాత్తు కొన్ని సంఘటనలు జరుగుతాయని అన్నారు. కాంగ్రెస్‌వి అన్నీ దివాలాకోరు రాజకీయాలని దుయ్యబట్టారు. కృష్ణా జలాలపై ముందుగానే తేదీని ప్రకటించి సభ పెట్టామని, ప్రజా ఉద్యమాన్ని లేవనెత్తామని చెప్పారు. అప్పటి వరకు ప్రభుత్వం నిద్రపోయిందని, నిన్న అసెంబ్లీలో తీర్మానం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ సభ ఉన్నదనే కాంగ్రెస్ సర్కారు పోటీగా మేడిగడ్డ టూర్ ఏర్పాటు చేసిందని చెప్పారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



పాలన ఇట్లే ఉంటే అటునుంచి అటే కాశీయాత్ర చేయాల్సిందే!

రైల్వేలో పోలీస్ అధికారుల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో పలువురు రైల్వే పోలీస్ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు రైల్వే అండ్ రోడ్ సేఫ్టీ విభాగం అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మల్టీ జోన్-2 నుంచి కొత్తగా రిపోర్టు చేసిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బీ సాయి ఈశ్వర్ గౌడ్‌ను ఇన్‌స్పెక్టర్ రైల్వే పోలీస్ (ఐఆర్‌పీ)గా సికింద్రాబాద్‌లోని రైల్వే పోలీస్ స్టేషన్‌కు, సికింద్రాబాద్ ఆర్‌పీఎస్‌లో పనిచేస్తున్న ఎం శ్రీనును సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మల్టీ జోన్-2 నుంచి కొత్తగా రిపోర్టు చేసిన ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ బీ ప్రవీణ్‌కుమార్‌ను ఐఆర్‌పీగా హైదరాబాద్‌కు, ఇప్పటివరకు హైదరాబాద్ ఆర్‌పీఎస్‌లో ఐఆర్‌పీగా పనిచేసిన ఏ శ్రీనివాస్‌ను సికింద్రాబాద్ (లైన్)కు బదిలీ చేశారు.

నేడు రాజ్యసభ అభ్యర్థుల ప్రకటన

- రేపే నామినేషన్ల దాఖలుకు ఆఖరు తేదీ
- మూడింటిలో 2 కాంగ్రెస్‌కు, 1 బీఆర్ఎస్‌కు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): రాష్ట్రం నుంచి ఖాళీ కానున్న మూడు రాజ్యసభ స్థానాలకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బుధవారం తమ అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నది. శాసనసభలో ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు అధికార కాంగ్రెస్ పార్టీకి, ఒకటి ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు దక్కనున్నది. నామినేషన్ల దాఖలుకు గురువారం చివరి తేదీ కావడంతో అధికార, ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థులను బుధవారం ప్రకటించే చాన్స్ ఉన్నది. ఈ నెల 11 నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైనప్పటికీ అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి ఇప్పటివరకు నామినేషన్లు దాఖలు కాలేదు.

రెండింటిలో ఒకటి ఏఐసీసీ కోటా

కాంగ్రెస్ పార్టీకి రెండు రాజ్యసభ సీట్లు దక్కనుండగా అందులో ఒకటి ఏఐసీసీ కోటా నుంచి, మరొకటి టీపీసీసీ నుంచి ఎంపిక చేయనున్నట్టు అధిష్ఠానం ఇదివరకే నిర్ణయించినట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. ఏఐసీసీ కోటాలో రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఇద్దరి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఇందులో ఒకరు ఏఐసీసీ కోశాధికారి, సీడబ్ల్యూసీ సభ్యుడు అజయ్‌మాకెన్ కాగా, మరొకరు కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టో సభ్యురాలు సుప్రియ ఉన్నారు. పార్టీ అధిష్ఠానం ఎవరిని ఎంపిక చేసేది బుధవారం తేలిపోనున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ దక్కని మాజీ మంత్రి, పీసీసీ క్రమశిక్షణా సంఘం చైర్మన్ డాక్టర్ జీ చిన్నారెడ్డి, మాజీ మంత్రి కే జానారెడ్డి, రాజ్యసభ మాజీ సభ్యుడు వీ హనుమంతరావు, చల్లా వంశీచందర్‌రెడ్డి, మాజీ కేంద్ర మంత్రి రేణుకాచౌదరి, మాజీ ఎంపీ విజయశాంతి పేర్లు పరిశీలనలో ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. రాజ్యసభకు రాష్ట్రం నుంచి ఎంపికయ్యే అభ్యర్థిని ఇప్పటికే అధిష్ఠానం ఎంపిక చేసిందని, ఆశావహులు ఎక్కువ సంఖ్యలో ఉండటం వల్ల పార్టీ గోప్యంగా పెట్టి ఉంటుందని కూడా అంటున్నారు.

బీఆర్ఎస్ నుంచి ఎవరు?

ఎమ్మెల్యేల సంఖ్య ప్రకారం ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీకి ఒక రాజ్యసభ సీటు దక్కనుండగా, ఇది ఎవరికి అనేది ఆసక్తికరంగా మారింది. త్వరలో పదవీకాలం ముగియనున్న ముగ్గురు రాజ్యసభ సభ్యుల్లో సంతోష్‌కుమార్, బడుగుల లింగయ్యయాదవ్, ఒద్దిరాజు రవిచంద్ర ఉన్నారు. వీరిలో రవిచంద్ర పదవీ కాలం రెండేండ్లకే ముగియనుండటంతో ఖాళీ అయ్యే స్థానానికి తననే ఎంపిక చేస్తారని ఆశిస్తున్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానం మాత్రం ఇప్పటి వరకు ఎవరినీ ప్రకటించలేదు. తన అభ్యర్థిని బుధవారం ప్రకటిస్తుందా? లేక నామినేషన్ల గడువు చివరి రోజైన గురువారం ప్రకటిస్తుందా? అనేది తెలియదని ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి.

ఎంపీ ఎన్నికలకు ఈసీ సర్వసన్నద్ధం

- ఈవీఎంల చెకింగ్‌లు పూర్తి
- 15 లక్షల కొత్త ఓటరుకార్డుల జారీకి చర్యలు
- త్వరలో మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక
- తగ్గిన వృద్ధ ఓటర్లు.. పెరిగిన యువ ఓటర్లు

హైదరాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ): షెడ్యూల్ ఎప్పుడు విడుదలైనా రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం సర్వసన్నద్ధమవుతున్నది. ఇప్పటికే అన్ని స్థాయిల ఎన్నికల అధికారులకు శిక్షణ, ఈవీఎంల పరిశీలన, ఓటరుకార్డుల ముద్రణను చేపట్టింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం కొత్తగా ఓటుహక్కు పొందిన, చిరునామా మార్చుకున్న దాదాపు 15 లక్షల మందికి కొత్తగా ఓటరుకార్డు ఇవ్వనున్నారు. ఓటరుకార్డుల పంపిణీ కోసం పోస్టల్‌శాఖతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దశాబ్దం క్రితం జారీ చేసిన ఓటరుకార్డు స్థానంలో కొత్త కార్డులు ఇవ్వాలనే ప్రతిపాదనకు సైతం కేంద్ర ఎన్నికల సంఘం అనుమతిస్తే మరో 40 లక్షలకార్డులను ముద్రించాల్సి ఉంటుంది. అయితే, దేశవ్యాప్తంగా ఓటరుకార్డు ముద్రణ కేంద్రాల సంఖ్య తక్కువగా ఉండటంతో దీనికి మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

కావాల్సినన్ని ఈవీఎంలు

రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలకు అవసరమైన ఈవీఎంల కంటే అదనంగానే సిద్ధంచేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 73,500 బ్యాలెట్ యూనిట్లు, 46,434 కంట్రోల్ యూనిట్లు, 54,451 వీవీ ప్యాట్లు అందుబాటులో ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపులో అవతవతకలు జరిగాయని హైకోర్టులో పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో 24 నియోజకవర్గాల్లోని ఈవీఎంలను పార్లమెంట్ ఎన్నికలకు వినియోగించడంలేదు. వీటి స్థానంలో రాష్ట్రంలో అదనంగా అందుబాటులో ఉన్న ఈవీఎంలను వినియోగంలోకి తెచ్చారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎంలను పరిశీలించి, వాటిలో ఎలాంటి డాటా, ఓట్లు లేవని నిర్ధారిస్తున్నారు.

త్వరలో మహబూబ్‌నగర్ షెడ్యూల్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న మహబూబ్‌నగర్ జిల్లా స్థానిక సంస్థలకు త్వరలో నోటిఫికేషన్ విడుదలకానున్నట్టు సమాచారం. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికకావడంతో ఆ స్థానానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. స్థానిక సంస్థల ఎన్నిక నిర్వహించాలంటే ఓటర్లలో కనీసం 75% ఓటర్లు ఉండాలి. స్థానిక సంస్థల ఎమ్మెల్సీకి ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు ఓటర్లుగా ఉంటారు. జూన్ మొదటి వారంలో ఎంపీటీసీల పదవీకాలం ముగియనున్నది. దీంతో సాధ్యమైనంత తొందరగా ఉప ఎన్నిక నిర్వహించాలని అధికారులు భావిస్తున్నారు.

రాష్ట్రంలో వృద్ధ ఓటర్ల సంఖ్య తగ్గింది. యువ ఓటర్లు, దివ్యాంగ ఓటర్ల సంఖ్య పెరిగింది. ఇటీవల ప్రకటించిన ఓటర్ల తుది జాబితా ప్రకారం రాష్ట్రంలో మొత్తం 3.30 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు.

వయస్సుల వారీగా రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య

వయస్సు	అసెంబ్లీ ఎన్నికల నాటికి	ప్రస్తుత ఓటర్లు
100 ఏండ్లు	7,877	6,282
80 ఏండ్లు నిండినవారు	4,87,095	4,54,230
18-19 ఏండ్లు	7,54,602	8,51,853
20-29 ఏండ్లు	64,57,828	66,27,096
దివ్యాంగులు	5,05,493	5,28,405
మహిళలు, పురుషుల నిష్పత్తి	1000:1002	1000:1009

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
రంగారెడ్డి	15.3°c	36.3°c
ఖమ్మం	17.0°c	33.0°c
మెదక్	17.9°c	34.9°c
ఆదిలాబాద్	18.0°c	35.0°c
హైదరాబాద్	18.6°c	33.3°c
వరంగల్	19.0°c	32.0°c
నల్లగొండ	19.2°c	34.4°c
మహబూబ్‌నగర్	19.5°c	33.5°c
కరీంనగర్	20.0°c	33.0°c
నిజామాబాద్	20.5°c	34.6°c

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో సీసీఐ అధికారులను నిలదీస్తున్న రైతులు

సీసీఐ తీరుపై పత్తి రైతుల నిరసన

ఆదిలాబాద్, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : సీసీఐ అధికారుల తీరును నిరసిస్తూ ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో మంగళవారం రైతులు ఆందోళన చేపట్టారు. భీంపూర్ మండలానికి చెందిన రైతులు ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు పత్తిని వాహనాల్లో తీసుకొచ్చారు. పత్తిలో తేమ ఎక్కువగా ఉన్నదని, కొంతసేపు ఆగాలని సీసీఐ సిబ్బంది సూచించారు. రెండు గంటల తర్వాత రైతులు పత్తిని కొనుగోలు చేయాలని కోరగా 9 శాతం తేమ ఉన్నట్టు నిర్ధారించి సీసీఐ లీజుకు తీసుకున్న జిన్నింగ్ మిల్లుకు పంపారు. అక్కడ సీసీఐ సిబ్బంది నాణ్యత లేదంటూ పత్తిని అన్‌లోడ్ చేయడానికి తిరస్కరించారు. విసుగు చెందిన రైతులు తమ పంటను తక్కువ ధరకే రూ.5,500లకు ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. పంట కొనుగోళ్లలో సీసీఐ అధికారుల తీరును నిరసిస్తూ మార్కెట్ యార్డులో ఆందోళన చేపట్టారు. సీసీఐ అధికారులు, ప్రైవేటు వ్యాపారులు కుమ్మక్కై దళారుల వద్ద నుంచి అక్రమంగా పత్తిని కొనుగోలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు తీసుకొచ్చిన పంటను కొనుగోలు చేయకుండా ఎందుకు తిరస్కరిస్తున్నారని ప్రశ్నించారు. రైతుల ఆందోళనతో కొనుగోళ్లు నిలిచిపోయాయి. సీసీఐ అధికారులు రైతులకు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని, దళారులకు తీసుకొచ్చి పంట నాణ్యతను పరిశీలించకుండా కొనుగోలు చేస్తున్నారని మండిపడ్డారు.

మహబూబాబాద్ మార్కెట్ ఎదుట ధర్నా చేస్తున్న మిర్చి రైతులు

మానుకోటలో మిర్చి రైతుల ఆందోళన

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 13 : మిర్చి కాంటా ఆలస్యం అవుతోందని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఎదుట రైతులు మంగళవారం ఆందోళనకు దిగారు. నాలుగు రోజులైనా మిర్చి కాంటాలు వేయడం లేదని, మార్కెట్ అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యాపారులు మార్కెట్‌కు వచ్చిన మిర్చికి కొన్ని బస్తాలకు మంచి ధర నిర్ణయించి మిగతా వాటికి తక్కువ రేటును నిర్ణయించడటం సరికాదని అన్నారు. ఖమ్మం, వరంగల్ మార్కెట్లలో మిర్చికి రూ. 21 వేల నుంచి రూ.22 వేల ధర పలికితే, మహబూబాబాద్ మార్కెట్‌లో మాత్రం రూ.18 వేల నుంచి రూ.19 వేలు మాత్రమే వస్తున్నదని ఆవేదన చెందారు.

పల్లి రైతు కన్నెర

- క్వింటాకు రూ.6,900 ప్రకటనపై నిరసన
- మార్కెట్ యార్డు ఎదుట వేరుశనగ కాల్చివేత
- అంబేద్కర్ చౌరస్తాలో భారీ రాస్తారోకో
- నాగర్‌కర్నూల్‌లోనూ పల్లి రైతు ఆందోళన

మహబూబ్‌నగర్ అంబేద్కర్ చౌరస్తాలో రాస్తారోకో చేపడుతున్న రైతులు

మహబూబ్‌నగర్/నాగర్‌కర్నూల్, ఫిబ్రవరి 13 : మద్దతు ధర కోసం పల్లి రైతులు కన్నెర్ర చేశారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో పాటు నాగర్‌కర్నూల్‌లో ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్ మార్కెట్ యార్డు ఎదుట పల్లి బస్తాలను కాల్చివేశారు. వివరాలు ఇలా.. పల్లి రైతులు మంగళవారం ఉదయం మహబూబ్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ కార్యాలయానికి చేరుకొని మద్దతు ధర ప్రకటించాలని వేడుకున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు టెండర్లు వేసి ధరలు నిర్ణయించారు. క్వింటా వేరుశనగకు గరిష్ఠంగా రూ.6,909 కాగా.. కనిష్ఠంగా రూ.4,005 ధర పలికింది. సోమవారం వరకు ధరలు కాస్త మంచిగానే ఉన్నా.. మంగళవారం ఒక్కసారిగా తగ్గడంతో ఆవేదన వ్యక్తం చేశారు. మార్కెట్ కార్యాలయం వద్దకు భారీగా చేరుకొని ఆందోళనకు దిగారు. వ్యవసాయ మార్కెట్ అధికారుల నుంచి ఎలాంటి స్పందన రాకపోగా.. కొందరు వ్యాపారులు వేరుశనగను సంచుల్లో నింపేందుకు సన్నద్ధమయ్యారు. ఆగ్రహించిన రైతులు సంచులను మార్కెట్ యార్డు బయటకు తీసుకొచ్చి కాల్చివేసి నిరసనను కొనసాగించారు. మార్కెట్ యార్డు నుంచి బోయపల్లి గేటు మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. చౌరస్తాలో భారీ ఎత్తున ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఒక మాట.. ఇప్పుడు ఒక మాట చెబుతున్నదని మండిపడ్డారు. అర్బన్ డిప్యూటీ తాసీల్దార్ దేవేందర్ ధర్నా వద్దకు చేరుకొని రైతులతో మాట్లాడారు. ధర కల్పిస్తామని నచ్చజెప్పి మార్కెట్ యార్డుకు తీసుకొచ్చారు. సాయంత్రం 6 గంటల నుంచి మార్కెటింగ్ శాఖ జిల్లా అధికారి బాలమణి, డీటీ దేవేందర్ రైతుల సమక్షంలో వ్యాపారులతో చర్చలు జరిపారు. ధర పెంపునకు వ్యాపారులు ససేమిరా అనడంతో రైతులు ఆందోళన మరింత ఉధృతం చేశారు. రాత్రి 9 వరకు చర్చలు జరగ్గా.. చివరకు క్వింటాకు రూ.100 పెంచుతామని వ్యాపారులు చెప్పగా రైతులు అయిష్టంగానే అంగీకరించారు. మార్కెట్ యార్డు వేరుశనగ రాసులతో నిండిపోవడంతో రైతులు బుధవారం మార్కెట్‌కు పల్లిని తీసుకురావొద్దని అధికారులు సూచించారు.

నాగర్‌కర్నూల్‌లోనూ ఆగ్రహం..

నాగర్‌కర్నూల్ వ్యవసాయ మార్కెట్ కార్యాలయం ఎదుట రైతు సంఘం ఆధ్వర్యంలో పల్లి రైతులు ధర్నా చేపట్టారు. మార్కెట్‌కు 1,700 క్వింటాళ్ల వేరుశనగను 201 మంది రైతులు విక్రయానికి తీసుకొచ్చారు. ఆశించిన ధర రాకపోవడంతో రైతు సంఘం నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. పల్లికి మద్దతు ధర కల్పించకుండా అధికారులు రైతును నట్టేట ముంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర కల్పించాలని వ్యవసాయ కార్యదర్శితో వాగ్వాదానికి దిగారు. మార్కెట్‌లో వ్యాపారులు కుమ్మక్కై తక్కువ ధర నిర్ణయించారని ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లో పల్లికి ఎంతో డిమాండ్ ఉన్నా ఇక్కడ మాత్రం ధర పెంచడం లేదని మండిపడ్డారు.

కాల్వకు స్థలం, సాగునీళ్లివ్వండి

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

ఇల్లంతకుంట, ఫిబ్రవరి 13: వేసిన పంటలు ఎండుతున్నాయని, కాల్వకు స్థ లం ఇప్పించి సాగు నీరు ఇవ్వాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని దాచారం గ్రామ రైతులు, బీజే పీ నాయకులు మంగళవారం తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు బెంద్రం తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. యాసంగిలో రైతులు వేసిన పంటలు సాగు నీరు అందక ఎండుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం రంగనాయకసాగర్ ప్రాజెక్టు ద్వారా గతంలో ఏటా కాళేశ్వరం జలాలు ఇచ్చేవారని గుర్తుచేశారు. అప్పుడు నీళ్లు పుష్కలంగా ఉండటంతో నేరుగా కాలువ లేకున్నా విఠలాపూర్, దాచారం గ్రామ శివారు మీదుగా సుమా రు రెండు కిలోమీటర్ల దూరం సరఫరా చేసి పంటలకు ఇచ్చేవారని గుర్తుచేశారు. ఇప్పుడు అన్ని నీళ్లు లేకపోవడంతో నేరుగా విఠలాపూర్ గ్రామ ప్రభుత్వ భూమిలో కాలువ నిర్మాణం చేపట్టి, అందులో నుంచి ఇవ్వాలని కోరారు. దీనివల్ల కేవలం అర కిలోమీటర్ సరఫ రా చేస్తే పంటలకు నీళ్లు అందుతాయని చెప్పారు. ఆ స్థలం అక్కడి రైతులు ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమస్యను పరిష్కరించి పంటలను కాపాడాలని కోరారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట తాసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దాచారం గ్రామ రైతులు

నిపుణ

విద్య, ఉద్యోగ సమాచారం

ఇస్రోలో..

ఇస్రో పరిధిలోని యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ అండ్ ఇస్రో టెలీమెట్రీ ట్రాకింగ్ అండ్ కమాండ్ నెట్‌వర్క్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 224
- పోస్టులు: సైంటిస్ట్/ఇంజినీర్, సైంటిఫిక్ అసిస్టెంట్, లైబ్రరీ అసిస్టెంట్, టెక్నీషియన్, కుక్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 1
- వెబ్‌సైట్: www.istrac.gov.in

రామగుండం ఫర్టిలైజర్స్‌లో...

రామగుండం ఫర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్‌లో కింది ఖాళీల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- మొత్తం ఖాళీలు: 35
- పోస్టులు: జూనియర్ ఇంజినీర్ అసోసియేట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, ఆఫీస్ అసిస్టెంట్ తదితరాలు
- విభాగాలు: ప్రొడక్షన్, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్ ల్యాబ్ తదితరాలు
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- చివరితేదీ: మార్చి 10
- వెబ్‌సైట్: https://www.rfcl.co.in

ఘట్‌కేసర్ కేవీలో...

హైదరాబాద్ ఘట్‌కేసర్‌లోని పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయంలో కాంట్రాక్టు ప్రాతిపదికన 2024-25 విద్యాసంవత్సరానికి కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.

- పోస్టులు: పీజీటీ (హిందీ, ఇంగ్లిష్, మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కంప్యూటర్ సైన్స్, కామర్స్, ఎకనామిక్స్)
- టీజీటీ (హిందీ, ఇంగ్లిష్, సంస్కృతం, మ్యాథ్స్, సోషల్ సైన్స్, సైన్స్), పీఆర్‌టీ, కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పోర్ట్స్ కోచ్, అకడమిక్ కౌన్సెలర్, స్పెషల్ ఎడ్యుకేటర్
- ఎంపిక: ఇంటర్వ్యూ ద్వారా
- ఇంటర్వ్యూ తేదీ: ఫిబ్రవరి 15
- అర్హతలు: ఆయా పోస్టులకు వేర్వేరు అర్హతలు ఉన్నాయి. ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు తీసుకెళ్లాల్సిన సర్టిఫికెట్లు తదితర వివరాలు వెబ్‌సైట్‌లో చూడవచ్చు.
- వెబ్‌సైట్: https://ghatkesarnfc.kvs.ac.in

ఆన్‌లైన్‌లో స్టడీ మెటీరియల్

పోటీ పరీక్షల ప్రత్యేకం

- ఎకానమీ, తెలంగాణ హిస్టరీ, అర్థమెటిక్స్ (గ్రూప్స్, డీఎస్సీ) కోసం పై క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.